# ఆశయాలు

-రావి-ఎన్-అవధాని

"ఏటవింది తల్లే! పసికూన ఆట్టా గుక్కపట్టేసినాది. కుసింత సంబాలించాల. నేకుంటే పెమాదం" అన్నాడు సింగన్న. సావిత్రి ఆ మాటలకు కాస్త ఉలిక్కిపడి వెనుదిరిగి వీధి వరండాలో నిల్చున్న కుర్రాడిని చూసింది.

సుమారు 15 ఏళ్ల వయస్సు, నిక్కరు, బనీను వేసుకున్నాడు. భుజంమీద తుండుగుడ్డ, గిరిజాల జుట్టు, ముఖంలో చక్కటి కళ, మెడలో పులిగోరు పతకం, గోడకు ఆనించిన లాఠీ, ఒక సంచీ ఉన్నాయి. బయట వర్షం జోరుగా పడుతోంది.

"పాపకు తేలు కుట్టింది. బాధకు తట్టుకోలేకపోతోంది. డాక్టర్ని తీసుకువస్తానని వెళ్లిన ఆయన ఇంకా రాలేదు. ఈ వర్షంలో డాక్టర్ ఎప్పుడొస్తాడో" అంది దిగులుగా.

"అట్టాగా... పికర్నేదు తల్లే. నాకాడ మూలిక ఉండాది. అది అరగదీసి ఆ గందం ఎడితె ఇసం సిటికెలో నాగేత్తాది" అన్నాడు.

సావిత్రి వాడి మాటలను నమ్మలేదు. అతని వేపు అనుమానంగా చూసింది.

"సత్తెం తల్లీ. కొండదేవర ఆన" అన్నాడు నమ్మకంగా.

ఆమె లోనికి వెళ్లి గందపుసాన, గ్లాసుతో నీళ్లు తెచ్చి వాడికిచ్చింది.

వాడు చిక్కంలోంచి వేరు ముక్క తీసి సాన మీద అరగదీసి ఆ గంధం మందంగా పాపకు తేలు కుట్టిన చోట పెట్టి నాలుగైదు సార్లు నోటితో గాలి ఊదాడు.

పాప ఏడుస్తూనే ఇదంతా చూస్తోంది. రెండు నిముషాల్లో పాప ఏడుపు ఆపింది.

"అద్గదీ. తగ్గిపోనాది సూడు సిట్టితల్లే" అన్నాడు నవ్వుతూ.

పాప అవునన్నట్లు తలాడించింది. ఇంకా కొద్దిగా బెక్కుతోంది.

సింగన్న మరో వేరు ముక్క తీసి అందులోంచి చిన్న ముక్క చిదిమి దానిని సావిత్రికిచ్చి "తల్లే ఇది సితక్కొట్టి బెల్లం ముక్కతో తినిపించు. ఆ వరుపు, వోపు నాగేత్తాది" అన్నాడు.

సావిత్రి ఏమాత్రం సందేహించక అతను చెప్పినట్లు చేసింది.

మూలికా వైద్యం బాగా పని చేసింది. పాప ఇప్పుడు నవ్వుతోంది.

కూతుర్ని ఒడిలో కూర్చోబెట్టుకుని ఆ కుర్రవాడి వివరాలు అడిగింది.

పేరు సింగన్నదొర. తండ్రి రెండేళ్లక్రితం పోయాడు. తల్లి, చెల్లి, నానమ్మ ఉన్నారు. జోడు కొండల నడుమ శబరిగూడెంనుంచి సంతకొచ్చాడు.

చెల్లికి నీలం గాజులు కొనాలని ఊర్లోకి వచ్చాడు. గాలివానకు గడపలో తల దాచుకున్నాడు అని తెలుసుకుంది.

సుబ్బరాజు సావిత్రిల ఏకైక సంతానం రాధ. వయస్సు 4 ఏళ్లు. ఒకటవ తరగతి చదువుతోంది. సుబ్బరాజుకి నాలుగు రోడ్ల కూడలిలో హోటలుంది. ఆటోలో డాక్టర్ని తీసుకవచ్చాడు సుబ్బరాజు.

"నాన్నా! నాకు నొప్పి పోయింది చూడు. సింగన్న నాకు మంచి మందిచ్చాడు" అంది తండ్రికి ఎదురుగా వెళ్లి.

"సింగన్న ఎవరమ్మా?" అని కూతుర్ని ఎత్తుకుని "రండి డాక్టర్‌గారూ... ఇలా కూర్చోండి" అని కుర్చీ చూపించాడు సుబ్బరాజు.

"అడుగో సింగన్న. అమ్మా నువ్వు చెప్పు" అంది.

"అమ్మాయికి తేలు కుట్టిన విషయం మీకు ఫోనులో చెప్పి డాక్టర్‌గార్ని తీసుకుని రమ్మన్నాను. బాధ భరించలేక గుక్కపట్టి ఏడుస్తోంది. వర్షానికి తల దాచుకునేందుకు మన వీధి వరండాలో నిల్చున్న ఈ అబ్బాయి సింగన్న దీని ఏడుపు విని విషయం తెలుసుకుని మూలికా వైద్యం చేసాడు. మందు అమృతంలా పని చేసింది. బాధ తగ్గిపోయింది. సమయానికి దేవుడిలా వచ్చి కాపాడాడు" అంది.

సుబ్బరాజు సింగన్నవైపు కృతజ్ఞతగా చూసాడు.

డాక్టర్ రాజు సింగన్న వివరాలు అడిగి తెలుసుకున్నాడు.

"అయితే నువ్వు మా లింగరాజు దొర కొడుకువన్నమాట. మీ నాన్న మా గురువుగారు. నాకు మూలికల గురించి, వాటి చికిత్స గురించి చాలా నేర్పాడు. మీ నాన్న చనిపోయిన విషయం తెలిసింది. కానీ మీ వివరాలు తెలియలేదు. నీకూ మూలికా వైద్యం తెలుసున్నమాట" అన్నాడు.

"నాకే కాదు దొరా మా అమ్మకూ, నాన్నమ్మకూ తెలుసు."

"పాపకు ఏ మందిచ్చావు? విషహారిణి మూలికేనా?"

"అవును దొరా. ఇసఅరని ఏరు అరగదీసి గందం ఎట్టా. సిలక సంజీయిని ఏరు ముక్క దినిపించినా"


"డాక్టర్‌గారూ! మీరూ మా పాపని చూడండి. మందు కానీ, ఇంజెక్షన్‌గానీ అవసరమేమో" అన్నాడు సుబ్బరాజు.

రాజు డాక్టర్ పాపను పరీక్షించి "ఏం పాపా ఇంకా నొప్పి ఉందా?" అని అడిగాడు.

"లేదు నొప్పిలేదు. సింగన్న మందిచ్చాడు. పోయింది" అంది.

"వాడిచ్చిన మందులు రెండూ ఇంజెక్షన్లకన్నా పవరున్నది. ఇంక మరే మందూ అవసరంలేదు."

"ఈ సింగన్న తండ్రి మూలికావైద్యంలో దిట్ట. ఎన్నోమార్లు మా ఇంగ్లీషు మందులకన్నా అతడి మూలికా మందులే గొప్పవని నాకు రుజువు చేసాడు. సంతకు వచ్చినప్పుడల్లా రకరకాల మూలికలెన్నో తెచ్చి ఇచ్చి వాటి ఔషధ విలువలు, చికిత్సా విధానం చెప్పి పేదవారికి ఉచితంగా వైద్యం చేయమనేవాడు. అంతేకాదు, పట్టు తేనె, మామిడి, పనస, పళ్లు తెచ్చి ఇచ్చేవాడు. దేనికీ డబ్బు తీసుకునేవాడుకాదు. ఎంతో బలవంతంమీద ఒక పూట మా



ఇంట భోజనం చేసేవాడు' అని డాక్టర్ లేచాడు.

"మీ ఫీజు..." అని సుబ్బరాజు వంద రూపాయల నోటు ఇవ్వబోయాడు.

డాక్టర్ చిరునవ్వు నవ్వి "ఉంచండి. నేను వైద్యం చేయలేదు కదా. అది సింగన్నకివ్వండి. అంతేకాదు, వాడీ వర్షంలోనూ చీకటిలో కొండదారిన పది మైళ్ల దూరం వాళ్ల గూడెం పోలేడు. అందువల్ల వాడికీ రాత్రి కాస్త భోజనం పెట్టి నిద్ర పోయేందుకు చోటిస్తే ఉదయాన్నే వెళ్లిపోతాడు. కొండదొరలు, రాజులు మొహమాటం ఎక్కువ. లేకుంటే గురుపుత్రుడ్ని మా ఇంటికి నాతో తీసుకుపోతా" అన్నాడు నవ్వుతూ.

"అయ్యో ఎంత మాట. వాడీ వర్షంలో వెళ్తానన్నా వెళ్లనీయము" అంది సావిత్రి.

ఆ రాత్రి సావిత్రి భర్తతో "ఏమండీ! నాకో ఆలోచన వచ్చింది. మీరు చీకట్నే వెళ్లి రాత్రి పొద్దుపోయేవరకు ఇంటికి రారు. ఇంట్లో మాట సాయానికి కూడా ఎవరూలేరు. సింగన్న చురుకైనవాడు, తెలివైనవాడు, వినయ విధేయతలు ఉన్నవాడు. వాడికింత తిండి పెడితే మన పంచన పడి ఉంటాడేమో అడుగుదామా" అంది.

"నేనూ అదే అనుకుంటున్నాను. కానీ వాడిమీద ఆధారపడ్డ తల్లి, బామ్మ, చెల్లి ఉన్నారన్నాడు. మరి వాడి తిండికోసం వారానికి వంద రూపాయలు ఇస్తామంటే ఒప్పుకోవచ్చు" అన్నాడు.

మర్నాడు ఉదయం వాడికీ విషయం చెప్పారు.

వాడు విని సమాధానం చెప్పలేదు.

"చూడు సింగన్నా! ఆ అడవిలో ఏముంది చెప్పు. ఇక్కడ ఉంటే మా అమ్మాయికి చదువుచెప్పడానికి టీచరు రోజా మా ఇంటికి వస్తాడు. నీకిష్టమైతే నువ్వూ అతనివద్ద చదువుకోవచ్చు. వారం వారం మీవారికి కావాల్సిన సరుకులు కొని తీసుకువెళ్లి వాళ్లకిచ్చి రావచ్చు. ఏమంటావు?" అన్నారు.

చదువు మాట వినగానే వాడి ముఖం విప్పారింది. 'తన ఆశయం నెరవేరుతోంది' అనుకున్నాడు.

"నాను పోయి మావోల్లత. గూడెం పెద్దలకు సెప్పి రావోల. మరు సంత నాటికి ఈడుంటా దొరా" అన్నాడు.

సావిత్రి వాడికి తన పాత చీరలు, రాధ గౌన్లు ఇచ్చింది.

***

సింగన్న మాట తప్పలేదు. రాధతోపాటు వాడికీ చదువు చెప్పున్నాడు టీచరు.

వాడి చురుకుదనం, తెలివితేటలు, చదువుమీద వాడి ఉన్న శ్రద్ధకు ఎంతో ముగ్ధుడయ్యాడు టీచరు.

అనతికాలంలోనే వాడు రాయడం, చదవడం, ఎక్కాలు లెక్కలు నేర్చుకున్నాడు.

సింగన్న ఏక సంతాగ్రాహి. ఒక మారు వింటే మర్చిపోడు. చదువేకాదు, ఇంటి పనంతా చకచకా చేస్తూ సావిత్రికి పూర్తి విశ్రాంతినిచ్చాడు. ఇంటి పనంతా చేసి హోటల్‌కు వెళ్లి సుబ్బరాజుకి సహాయపడుతున్నాడు. సుబ్బరాజు వాడికి హోటలు పనంతా నేర్పాడు.

వాడి నీతి నిజాయితీ, వినయవిధేయత, పని నేర్చుకోవాలనే తపన గమనించాడు సుబ్బరాజు. అంతేకాదు 'వాడికి ఇతర పనివాళ్ల చేత పని చేయించగల నేర్పు, ఒడుపు తెలుసునని గ్రహించి హోటల్ పనివాడికి అప్పగించి రోజూ నాలుగైదు గంటలు ఇంటికివచ్చి విశ్రాంతి తీసుకుంటున్నాడు సుబ్బరాజు.


హోటల్‌కు అవసరమైన సరుకులన్నీ సింగన్న కొని తెస్తున్నాడు. గిరిజన స్టోర్స్ గురించి తెలుసుకుని తమవారు వారంవారం సంతకుతెచ్చే సరుకులు దళారులకు అమ్మకుండా గిరిజన స్టోర్స్‌కు అమ్మిస్తున్నాడు.

సావిత్రి అక్క కూతురు కావేరీ చిన్నతనంలోనే తల్లిదండ్రులను పోగొట్టుకుని మేనమామ ఇంట పెరుగుతోంది.

ఆ పిల్లను సింగన్నకు ఇచ్చి పెళ్లిచేసి వాళ్లను తనవద్ద ఉంచుకోవాలనే కోరిక సావిత్రికి కలిగింది.

మంచి సెంటర్‌లో ఉన్న తన హోటల్‌లో కాఫీ, టిఫిన్ సెక్షన్స్ ఉన్నాయి. మేడమీద మీల్సు సెక్షన్ కూడా పెట్టి ఒక సెక్షన్‌ను సింగన్నకు అప్పగించాలని సుబ్బరాజు ఆలోచన.


భార్యాభర్తలు తమ ఆలోచనకు మురిసిపోయారు. సుబ్బరాజు అక్క అనసూయమ్మ, బావ గోపరాజు గోవిందపురం నుండి వచ్చారు. గోపరా



## ఫ్లయింగ్ కార్

ట్రాఫిక్ జామ్‌లో ఇరుక్కుపోయిన కారుని విమానంలా ఎగరేసుకుని గాలిలో మీరనుకున్న చోటుకి వెళ్లవచ్చునంటున్నారు అమెరికన్ టెర్రాఫ్యూగియా ట్రాన్సిషన్ కంపెనీవారు. రోడ్డుపై వెళ్లే కారు 30 సెకన్లలో తన రెక్కల్ని విప్పుకుని విమానంలా పైకిలేచిపోగలదట. ఇద్దరు కూర్చునే ఈ కారు విమానం ఇప్పటికే 27 సార్లు ఆకాశంలోకి ఎగిరిందిట. 185 కి.మీ వేగంతో 725 కి.మీ దూరం ఏకబిగిన వెళ్లగలిగే ఈ కారు ప్లేన్ ఖరీదు 2 లక్షల డాలర్లు. ఈ కారు విమానం 2011 నాటికి మార్కెట్లో వుంటుంది.

-తటవర్తి



జుకి గోవిందపురంలో పంట పొలాలే కాదు కొబ్బరి, మామిడి,అరటి తోటలున్నాయి.

వారు సింగన్న గురించి అంతా తెలుసుకున్నారు. వాడి పనితనం చూసారు. అటువంటి సమర్థుడైన పనివాడికోసం వాళ్లు ఎన్నాళ్లుగానో వెతుకుతున్నారు.

సుబ్బరాజుతో విషయం చెప్పి వాడిని ఒప్పించి తమతో పంపమని చెప్పారు.

"వాడు ఉండడానికి ఇల్లు, వాడి కుటుంబానికి నెలసరి తిండి గింజలు, వాడికి నెలజీతం ఇస్తాము. వాడు కాదు కూడదంటే నాలుగు మడిచెక్కలు వాడి పేర రాస్తాము'' అన్నారు.

అయితే సుబ్బరాజు దంపతులకు సింగన్నను ఎట్టి పరిస్థితుల్లోనూ వదులుకోవాలని లేదు. అలాగని అక్కా బావలతో విరోధం కూడా అతనికి ఎంతమాత్రం ఇష్టంలేదు.

"వాడి పెద్దవాళ్లతో ఈ విషయం చర్చించి మీకు చెప్తాం'' అని నమ్మించి వారిని పంపించారు లేకుంటే వాళ్లే సింగన్నతో మాట్లాడి తీసుకుపోతారనే భయంతో.

డాక్టర్‌గారికి కావాల్సిన మూలికలు, తేనె వగైరాలు సింగన్న తెచ్చి ఇస్తున్నాడు.

జనారణ్యంలో ఏ విధంగా మెలగాలో సింగన్నకు వాడి గూడెం ప్రజలకు అవగతమైంది.

వారిని ఇప్పుడు దళారులు మోసగించలేకపోతున్నారు. వారు మునుపటిలా దళారుల సారాపేకట్లను ఆశించడంలేదు. తమ సరుకు నేరుగా గిరిజన స్టోర్స్‌వారికిచ్చి వారిచ్చే డబ్బుతో టోకు వర్తకుల వద్ద తమకు కావాల్సినవి కొనుక్కుంటున్నారు.

"దొరా! మా అయ్య పోయి ఆరెల్లవింది. మా కొండ దేవుల్ల కొలువు జాతర సంబరాలు సెయ్యనేదు. ఎంటనే సెయ్యాలని మా గూడెం పెద్దలు పట్టుపట్టినారు. జాతరకు తవరు అమ్మగోర్ని పాపమ్మగోర్ని ఎంటదీసుకురావోల. డాట్టరుబావుకి సెప్పినాను. మా గూడెపోన్ని సాయం అంపుతాను'' అన్నాడు.

'అదే మంచి అవకాశం. జాతరకు వెళ్లి సింగన్న తల్లితోను, బామ్మతోను, గూడెం పెద్దలతో మాట్లాడి వాడిని శాశ్వతంగా తమవద్ద ఉంచుకోవచ్చు' అనుకున్నారు సుబ్బరాజు దంపతులు.

***

జాతరకు సుబ్బరాజు కుటుంబం, డాక్టర్ రాజు కుటుంబం జీపులో సింగన్న పంపిన మనిషి సాయంతో బయలుదేరారు. కొండ చుట్టి ఉన్న బండి దారిన సుమారు మూడుగంటల ప్రయాణం. కొండల చుట్టూ ప్రయాణం ఎంతో ఆహ్లాదకరంగా అనిపించింది.

రెండు కొండల నడుల చక్కటి పంట పొలాలు, వాటి చుట్టూ మామిడి, పనస, కుంకుడు, చింత, తాటిచెట్లు, కొండమీది నుండి జలజల పారుతున్న కొండవాగు... ప్రకృతి అందాలను వర్ణించడానికి మాటలు చాలవేమో అనిపించింది.

కొండవాగు చెంత విశాలమైన స్థలం చుట్టూ వలయాకారంగా వెదురు, బ్రహ్మచెవుడు, బలుసు, పరిమితుప్పలు, పొదలు గూడెం చుట్టూ వేసిన కంచెలా, పెట్టని ప్రహరీ గోడలా ఉంది. అడవి జంతువులు ఏవీ వాటి గుండా గూడెంలోకి ప్రవేశించలేవు.

"దొరా! ఈ రెండు కొండల నడుమ అవుపడుతున్న పంటసేలు, ఆటి సుట్టూతా ఉన్న సెట్లు సింగన్న దొరవేనండి'' అన్నాడు.

"మరి సింగన్న మా ఇంటివద్ద ఇన్నాళ్లూ పనివాడిలా..."

"సెప్పమంతారా! సదువుకోసం దొరా. కూడునేకకాదు. ఆడి సేతికింద ఈ పొద్దు వొందమందివి సుకంగా బతకతన్నావు దొరా. ఆడు తవరింట నేర్సిన సదువు వోరంవోరం గూడెంకొచ్చి మాకు సెప్పేవోడు. ఈ పొద్దు మా గూడెంల సిన్నాపెద్దా, ఆడా మొగా అచ్చరాలు రాసీయగలరు, నెక్కలు సెప్పగలరు. సింగన్న దొర కోరిక ఇదంతా ఆడి సదువు, మా సదువు అయేవొరకూ గూడెం నాయకుడి గద్దె నెక్కను అని లంకెట్టి నెగ్గినాడు. ఈ పొద్దు పెందిల ఆడికి కల్లేనం సేసి ఆ జంటని గద్దెమీద కూకోపెట్టి ఆరిసేత కొండ దేవతల కొలువు సంబరాలు సేస్తన్నావు దొరా'' అన్న వాడి మాటలకు నిర్ఘాంతపోయారు సుబ్బరాజు, సావిత్రి.



## కమలినీ రికార్డ్

కమలినీ ముఖర్జీ నటించిన 'గమ్యం' తెలుగులో సక్సెస్ కావటంతో దాన్ని తమిళ, కన్నడ భాషల్లో రీమేక్ చేసారు. వాటిలో కూడా కమలినీ హీరోయిన్‌గా నటించింది. ఇప్పుడు బెంగాలీ భాషలో కూడా 'గమ్యం' సినిమాని నిర్మించడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఆసక్తికరంగా ఈ బెంగాలీ సినిమాలో కూడా కమలినీ ముఖర్జీయే కథానాయికగా నటించడం ఓ విశేషంగానే చెప్పుకోవాలి. ఈమధ్యనే జెనీలియా కూడా 'బొమ్మరిల్లు' తమిళ వెర్షన్‌లో నటించాక ఇప్పుడు హిందీ రీమేక్‌లో కూడా నటిస్తోంది.

